సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణికి 50 ఫిర్యాదులు
- వినతులు స్వీకరించిన అధికారులు

కామారెడ్డి క్రైం : ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఏవో రవీందర్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 50 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 32 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా మిగితావి ఆయా శాఖలకు చెందినవి నమోదయ్యాయి. కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు అందరూ ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, కార్యాచరణలో బిజీగా ఉండటంతో ప్రజావాణికి హాజరుకాలేదు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు వెంటనే ఇవ్వాలి..

ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే కట్టించి ఇవ్వాలని తెలంగాణ జన సమితి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. సోమవారం ప్రజావాణిలో భాగంగా జనసమితి నాయకులు ఏఓ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజలను మోసం చేస్తే రాబోయే రోజుల్లో తెలంగాణ జన సమితి పార్టీ పోరాటం చేస్తుందన్నారు.

హామీలను అమలు చేయాలి..

రాష్ట్ర ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎల్. దశరథ్ మాట్లాడుతూ.. జిల్లాలోని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు, అర్హులైన వారందరికీ ఆసరా పింఛన్లు ఇవ్వాలన్నారు. ఏవో రవీందర్‌కు ఇవ్వడం వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పి.బాలరాజ్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు దేవయ్య, పి రాజు, ఈశ్వర్, ఖాసీం తదితరులున్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

58 జీవోను వెంటనే అమలు చేయాలి..

58 జీవోను వెంటనే అమలు చేసి గుడిసె వాసులందరికీ పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ 2014లో ప్రభుత్వం తీసుకొచ్చిన 58 జీవోను జిల్లాలో అమలు చేసి అర్హులైన పేద ప్రజలందరికీ 125 గజాల చొప్పున ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, నాయకులు చంద్రకళ, బాబూజాన్, శ్యామల, కవిత, వెంకటలక్ష్మి, బాలరాజ్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

సార్‌ను చూసేందుకే వచ్చా..

రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు బదలకుంట రాజయ్య సోమవారం ప్రజావాణి వద్ద అందర్నీ ఆశ్చర్యపరిచాడు. తనకు ఎలాంటి సమస్యలు లేవని, ఫిర్యాదు చేయడానికో, దరఖాస్తు ఇవ్వడానికో తాను రాలేదన్నాడు. మరెందుకు ప్రజావాణికి వచ్చావని అడగగా ఒకసారి కలెక్టర్ సార్‌ను చూసి, ఆయన ఆటోగ్రాఫ్ తీసుకుని వెళ్ళడానికి వచ్చానని బదులిచ్చాడు. కలెక్టర్ ప్రజావాణికి రాక పోవడంతో మరోసారి వస్తానంటూ నిరాశగా వెళ్లిపోయాడు.

– రాజయ్య, పారిశుధ్య కార్మికుడు, మద్దికుంట



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన పారిశుధ్య కార్మికుడు రాజయ్య





కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న జన సమితి నాయకులు, బాధితులతో మాట్లాడుతున్న ఏవో



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న 2006-07 బ్యాచ్ విద్యార్థులు

ఆర్మూర్ పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవన్‌లో సోమవారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. పిప్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెంది 2006–2007 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కాగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు సన్మానించారు. అలాగే చాలాకాలం తర్వాత కలిసి స్నేహితులతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

– ఆర్మూర్ టౌన్

నేడు తెయూలో వర్క్‌షాప్



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ అప్లయిడ్ స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం (28న) 'అప్లికేషన్స్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఇన్ సైన్స్' అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ కే సంపత్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. వర్క్‌షాప్‌లో వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల మాథ్స్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్ విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బ్రోచర్ ఆవిష్కరణలో ప్రిన్సిపాల్ సీహెచ్‌ఆరతి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు నుంచి దిగబోయి వ్యక్తి మృతి

మిర్యాలగూడ అర్బన్ : వేగంగా వెళ్తున్న రైలు నుంచి దిగబోయి ఓ వ్యక్తి మృతిచెందాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన జగదీష్ రాజ్‌పురోహిత్ (28) మిర్యాలగూడ పట్టణంలో ఫ్లెవుడ్ దుకాణం నిర్వహిస్తూ రవీంద్రనగర్‌కాలనీలో నివాసముంటున్నాడు. అహ్మదాబాద్ నుంచి మిర్యాలగూడకు వచ్చేందుకు ఆదివారం బావానగర్- కాకినాడ రైలు ఎక్కాడు. రాత్రి 11: 45 నిమిషాలకు మిర్యాలగూడ స్టేషన్‌లో ఆగిన రైలు తిరిగి కదిలింది. నిద్రలో ఉన్న జగదీశ్ రాజ్‌పురోహిత్‌కు మెలకువ రావడంతో వెళ్తున్న రైలు నుంచి రెండో ప్లాట్‌ఫాంపై దిగేందుకు దూకాడు. ప్రమాదవశాత్తు అతడు రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో ఇరుక్కుని, తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.



జగదీష్ రాజ్‌పురోహిత్ మృతదేహం

చికిత్స పొందుతూ ఒకరు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని వెంకంపల్లి గ్రామానికి చెందిన సామల సాయిలు(51) ఆదివారం రాత్రి నిజామాబాద్‌లోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం సాయిలు గత కొంతకాలంగా మద్యానికి బానిసవడంతో అతని ఆరోగ్యం క్షీణించింది. ఈ క్రమంలో 6 నెలలుగా పని చేతకాకపోవడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సాయిలు ఈ నెల 25వ తేదీన ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే సాయిలును చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు కామారెడ్డి ఆస్పత్రికి, అక్కడి నుంచి నిజామాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఆదివారం రాత్రి నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయిలు తుదిశ్వాస విడిచాడు. మృతుని భార్య జయమ్మ ఫిర్యాదు మరకు కేసు నమోదు చేసినట్లు నాగిరెడ్డిపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు.



సామల సాయిలు(ఫైల్)

ఎంపీటీసీ సభ్యురాలి ఇంటిపై దాడి

మాచారెడ్డి : మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు రావుల వినోద ఇంటిపై అదే గ్రామానికి చెందిన ధర్మాజి నర్సాగౌడ్, అయన కుమారుడు దేవరాజగౌడ్‌లతో పాటు మరికొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి దాడి చేసినట్లు బాధితురాలు పోలీసులకు పిర్యాదు చేశారు. ఫోన్‌లో దుర్భాషలాడిన అనంతరం అర్ధ రాత్రి ఇంటిపై దాడి చేశారని ఆమె ఆవేదన చెందారు. దుండగులు గేట్ తాళాలు పగులగొట్టి ఇంట్లోకి వచ్చారని, తన భర్త ప్రభాకర్ 100కు ఫోన్ చేయగా పోలీసు జీప్ సైరన్ విన్న దుండగులు పారిపోయారన్నారు. చెరువు శిఖం భూమి కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేసినందుకే తమపై దాడి చేశారన్నారు.

గొడ్డలి దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

ఖలీల్‌వాడి : నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక్ నగర్‌కు చెందిన హనుమ శేఖర్ గొడ్డలితో దాడి చేసిన కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమశేఖర్‌ను ఆర్యనగర్‌లో ఉన్న తన బంధువులు హనుమా గంగాధర్ ఆలియాస్ చిన్న గంగాధర్, అతని కుమారుడు నరేష్ వారి ఇంటికి పిలిపించారు. పందిపిల్ల కనబడటం లేదని పేర్కొంటూ గతంలో పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని గొడవకు దిగారు. ఇద్దర కలిసి గొడలితో హనుమ శేఖర్‌ను గాయపర్చి పారిపోయినట్లు తెలిపారు. హనుమ శేఖర్ ఫోన్‌లో భార్యకు సమాచారం అందించి వివరాలను తెలిపినట్లు చెప్పారు. శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదానికి గురైన వారు దొంగలుగా గుర్తింపు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులు దొంగలుగా గుర్తించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కుద్వాన్‌పూర్ గ్రామంలోని మెబైల్ దుకాణంలో దొంగతనానికి పాల్పడి పారిపోతుండగా చెట్టుకి ఢీకొని ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి పిట్లం అంజి(23), తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 18ఏళ్ల వయస్సు వ్యక్తి షేక్ సొహైల్ గా గుర్తించామన్నారు. వీరిద్దరు నిర్మల్ పట్టణానికి చెందిన వారని, వీరిరువురు కలిసి నిర్మల్, ఇచ్చోడ, దిల్వర్‌పూర్, జగిత్యాల, మల్లాపూర్ పోలిస్ స్టేషన్ పరిధిలో పలు చోరీలకు పాల్పడి జైల్‌కి వెళ్లి వచ్చినవారిగా గుర్తించామన్నారు. నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామానికి వచ్చి చోరికి వచ్చి ప్రమాదానికి గురయ్యారన్నారు.

బైక్ చోరీ

రుద్రూర్ : రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీనివాస వైన్స్ ఎదుట పార్క్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రాయకూర్ గ్రామానికి చెందిన శంకర్ వైన్స్ షాప్‌లో పని చేస్తాడు. విధులు ముగించుకుని బయటకు వచ్చి చూసే సరికి బైక్ కన్పించలేదు. సమీపంలో వెతికినప్పటికీ దొరకనందున పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

రాత్రివేళ దుకాణాలు తెరిచిన ఉంచిన వారిపై కేసులు

ఖలీల్‌వాడి : నగరంలోని ఒకటవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లేట్‌నైట్ వరకు తెరిచి ఉంచిన షాపులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. జునేరియా హోటల్, రెన్‌బో బార్, స్నూకర్ సెంటర్‌పై కేసులు నమోదు చేశామన్నారు. షాప్ యాజమాన్యలు అర్ధరాత్రి వరకు షాపులను తెరిచి ఉంచవద్దని, తొందరగా మూసి వేసి సహకరించాలని తెలిపారు.

పోక్సో కేసు నమోదు

ఖలీల్‌వాడి : నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ బాలికను వేధించిన కేసులో ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన సృజన్ ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేయడం, వెంటపడటంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. యువకుడిని కోర్టులో హాజరుపర్చామన్నారు.

రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి) : ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు గణితంలో రాణించాలని తెయూ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ పిలుపునిచ్చారు. తెయూ మాథమెటిక్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కంప్యూటర్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో 'జోవియాలిటి ఆఫ్ మ్యాథమెటిక్స్' నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్‌లో వీసీ, ప్రధాన వక్తగా హాజరైన వరంగల్ ఎన్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దీపిక లీల మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని లెక్కలంటే భయాన్ని పోగొట్టుకోవాలన్నారు. కో ఆర్డినేటర్ శ్రీనివాస్, అధ్యాపకులు కె.శ్వేత, ఎం.చంద్రశేఖర్, యు.పద్మ, విద్యార్థులు త దితరులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో పోస్టర్ ప్ర జెంటేషన్ చేసిన వారిలో ముగ్గురు విద్యార్థులకు వీ సీ రవీందర్ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఇందులో భాగంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల, కామారెడ్డి విద్యార్థి కి రూ.3వేలు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల, ఆర్మూర్ విద్యార్థికి రూ.2 వేలు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల, కామారెడ్డి విద్యార్థి కి రూ.వేయి అందజేశారు.



మాట్లాడుతున్న తెయూ వీసీ రవీందర్

యువగళమంతా బీజేపీ వైపే..

పిట్లం(జుక్కల్): పేదల కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటోందని, యువత చూపు ప్రస్తుతం బీజేపీ వైపే ఉందని కామారెడ్డి బీజేపీ పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతార పేర్కొన్నారు. ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం పలు గ్రామాల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పిట్లం మండలం అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వైద్యురాలు ప్రీతి ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే కారణమని, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని పేర్కొంటూ ఈ కార్యక్రమం చేపట్టారు. బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్ పంతులు, మండల అధ్యక్షుడు అభినయ్ రెడ్డి, నాయకులు ఆగంరెడ్డి, మోహన్ రెడ్డి, అశోక్ రాజ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న అరుణతార

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

డిచ్‌పల్లి : మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన రైతు బొల్లారం స్వామి (48) అప్పుల బాధతో మనస్తాపానికి గురైన విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు డిచ్‌పల్లి ఎస్సై కే.గణేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం స్వామికి భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం కొంత కాలం గల్ఫ్‌కు వెళ్లి వచ్చిన స్వామి వ్యవసాయం చేస్తున్నాడు. గల్ఫ్ కోసం పంట సాగు కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. దీనికి తోడు కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలు ఇబ్బంది పెడుతుండగా ఇటీవలే ఒక ఎకరం అమ్మినా అప్పులు తీరక పోవడంతో మనస్తాపంలో ఈనెల 25న విషం తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే చికిత్స కోసం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ స్వామి సోమవారం మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



బొల్లారం స్వామి (ఫైల్)

కూతురి హత్య కేసులో జీవిత ఖైదు

- ప్రియుడితో కలిసి తల్లి ఘాతుకం
- నిజామాబాద్ సెషన్స్ జడ్జి తీర్పు

ఖలీల్‌వాడి : అక్రమ సంబంధానికి అడ్డుగా ఉందని ఆరేళ్ల కూతురిని ప్రియుడితో కలిసి హత్య చేసిన తల్లి, సహకరించిన ప్రియుడికి జీవితఖైదు విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల తీర్పు చెప్పారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ పీఎస్ పరిధిలో ఆగస్టు 22, 2022న చిన్నాపూర్ అటవీప్రాంతంలో ఆరేళ్ల బాలిక మృతదేహం లభ్యమైన కేసులో ప్రాథమిక నివేదికను మాక్లూర్ పీఎస్ పోలీసులు కోర్టుకు సమర్పించారు. ఈ కేసులో నార్త్ సీఐ బి నరహరి 45 రోజుల్లో నేర విచారణ పూర్తి చేసి, అభియోగాలను కోర్టులో సమర్పించారు. విజయవాడకు చెందిన కాపర్తి దుర్గ భవాని బతుకుదెరువు కోసం నిర్మల్‌కు వచ్చారు. అయితే తన భర్త గురునాథం మేస్త్రీ పని చేయకుండా ఆటో నడుపుతున్నాడని గొడవపడి తిరిగి విజయవాడ వెళ్లారు. అయితే నిర్మల్‌లో ఉన్న సమయంలో దుబాయి శ్రీనుతో భవానీకి పరిచయం ఏర్పడి అక్రమ సంబంధానికి దారితీసింది. విజయవాడ వెళ్లిన ఆమె భర్తకు చెప్పకుండా ఆరేళ్ల కూతురు నాగలక్ష్మి, 14నెలల కూతురు గీత మాధురితో నిజామాబాద్ చేరుకుని శ్రీనుతో కలిసి సహజీవనం చేస్తోంది. అయితే అక్రమ సంబంధానికి ఆరేళ్ల కూతురు అడ్డుగా ఉండడంతో శీను రోజూ ఆ బాలికను హింసించేవాడు. ఒకరోజు బాలికకు బీడీలతో వాతలు పెట్టగా పెద్దగా అరవడంతో ఇరువురు కలిసి గొంతునులిమి బాలికను హత్య చేశారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా శవాన్ని ఆర్టీసీ బస్సులో చిన్నాపూర్ సమీపంలోకి తీసుకెళ్లారు. తర్వాత సమీప అడవిలోని కాలువలో పడేశారు. దుర్గాభవాని తన తల్లికి ఫోన్ చేసి బాలిక నాగలక్ష్మికి గాయాలయ్యాయని పేర్కొనగా ఆమె తన అల్లుడు గురునాథంతో నిజామాబాద్ వచ్చి చిన్నారి జాడ తెలియకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులు నేర విచారణ చేసి దుర్గాభవానీ, శీనును అరెస్ట్ చేయగా వారు నేరాన్ని అంగీకరించారు. వీరిపై నేరారోపణలు రుజువు కావడంతో ఇద్దరికి హత్య కేసులో జీవిత ఖైదు విధించారు. సాక్ష్యాలను తారుమారు చేసిన విషయంలో ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిడుగు రవిరాజ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. ఆయనకు కోర్టు డ్యూటీ పోలీస్ ఆఫీసర్స్ విశాల్ గౌడ్ ,విక్రమ్ సహకరించారు.


గిద్దలో పోలీసుల కార్డన్ సెర్చ్


- సైబర్ క్రైం, మహిళల సేఫ్టీపై అవగాహన



రామారెడ్డి(ఎల్లారెడ్డి) : రామారెడ్డి మండలంలోని గిద్ద గ్రామంలో సోమవారం సాయంత్రం కామారెడ్డి రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఈ తనిఖీల్లో ధ్రువపత్రాలు లేని 56 బైకులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రూరల్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల రక్షణకు పోలీసుల అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, దీనిలో భాగంగా షీ టీంలను ఏర్పాటు చేశామన్నారు. త్రిబుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు అనిల్, ఆనంద్‌గౌడ్, ప్రసాద్, సాయికుమార్, బాల్‌రెడ్డి, సుధాకర్, ఇంద్రసేనరెడ్డి, గిద్ద సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమై.. అస్థిపంజరంగా కనిపించి..





గంగాధర్ (ఫైల్)

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రానికి చెందిన గంగాధర్(32) నాలుగు నెలల క్రితం అదృశ్యమయ్యాడని పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే సోమవారం పెద్దకొడప్‌గల్ పెద్ద చెరువులో ఓ శవం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో అస్థిపంజరం స్థానికులకు కనిపించగా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని అతడు వేసుకున్న దుస్తులు, జపమాలను బట్టి అతడు గంగాధర్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలంలోనే బాన్సువాడ వైద్యులు డాక్టర్ మోహన్ రెడ్డితో శవ పరీక్షలు చేయించి, డీఎన్ఏ టెస్ట్ కోసం ల్యాబ్ పంపామని ఏఎస్సై రాములు తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి గాయాలు..



ధర్పల్లి (ఇందల్వాయి): ఇటుక బట్టీలో ఇటుకల తయారీకి మట్టిని బట్టీ కార్మికుడు కేజ్‌వీల్ ట్రాక్టర్‌తో తొక్కిస్తున్న తరుణంలో ట్రాక్టర్ బోల్తా పడి దాని కింద చిక్కుకొని రెండు గంటలపాటు నరక యాతన అనుభవించిన సంఘటన ఇందల్వాయి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చంద్రాయన్‌పల్లి శివారులోని ఒక ఇటుక బట్టీలో మహారాష్ట్ర చెందినవాసి నాగనాథ్ పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే సోమవారం కేజ్‌వీల్ ట్రాక్టర్ తో మట్టిని తొక్కిస్తున్నప్పుడు ట్రాక్టర్ ఒకసారిగా తిరగబడి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాగనాథ్ కాళ్లు ట్రాక్టర్ ఇంజన్ కింద చిక్కుకుపోవడంతో బయటకు రాలేకపోయాడు. రెండు గంటలపాటు శ్రమించినా ట్రాక్టర్‌ను అక్కడి నుండి కదపలేకపోయారు. చివరికి జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను పక్కకు జరపడంతో బాధితుడు ప్రాణాలతో బయటపడ్డాడు.

అంత్యక్రియలకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల..!

- 5తులాల బంగారం, 30 తులాల వెండి, రూ. లక్షన్నర నగల అపహరణ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : బంధువు అంత్యక్రియలకు వెళ్లొచ్చేసరికి గుర్తుతెలియని దుండగులు ఇల్లును గుల్ల చేసిన ఘటన సోమవారం నాగిరెడ్డిపేట మండలంలోని పెద్దఆత్మకూర్ గ్రామంలో జరిగింది. పెద్దఆత్మకూర్‌కు చెందిన కోట ఈశ్వరయ్య సోమవారం తన ఇంటికి తాళం వేసి మండలంలోని వెంకంపల్లిలో జరిగిన సమీప బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు కుటుంబసభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. బీరువాలో దాచిన సుమారు 5 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి పట్టగొలుసులు, రూ. లక్షన్నర నగదును దుండగులు చోరీ చేసినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. నాగిరెడ్డిపేట ఎస్సై ఆంజనేయులు విచారణ చేస్తున్నారు.

క్లుప్తంగా

దుబాయ్‌లో పార్థసారథికి ఘన స్వాగతం



పెర్కిట్(ఆర్మూర్): దుబాయ్‌లో ఎమిరేట్స్ ఫార్మసి అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నిల కమిషన్ చిట్ల పార్థసారథికి ఘనంగా స్వాగతం పలికారు. అనధికార పర్యటనలో భాగంగా దుబాయ్‌లో పర్యటిస్తున్న ఆయనను వివిధ ఉపాధి హోదాల్లో ఉన్న నిజామాబాద్, కరీంనగర్, వరంగల్‌వాసులు పార్థసారథి కలిసి ఆయన సేవలను గుర్తించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండో అరబ్ కౌన్సిలర్ ఫర్ ఎడ్యుకేషన్ ఆఫ్ లిట్రేచర్ కన్వీనర్ మహమ్మద్ అదీబ్ ఉల్లా, డాక్టర్ గోఫ్ తిఖర్, అలీముద్దీన్, అహ్మద్, అస్సార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర తిరుపతి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు



నిజామాబాద్ సిటీ : నగరంలోని ఉత్తర తిరుపతి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండవరోజు ఆలయంలో ధ్వజారోహణం, గణపతి హోమం, నీరాజన మంత్ర పుష్పం కార్యక్రమాలు జరిగాయి. తిరుమల నుంచి విచ్చేసిన వేదపండితులు నారాయణ భట్టిదార్ బృందం ఆధ్వర్యంలో పైకార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిషోర్ స్వామి, మోహన్ దత్తా, దేవాలయం ట్రస్టీ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. డిగ్రీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలో 2,483 మంది విద్యార్థులకు గానూ 2,258 మంది హాజరయ్యారన్నారు. ఎల్ఎల్‌బీ 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలో 36 మందికి గానూ 27 మంది, ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలో 24మంది కి గానూ 21 మంది హాజరయ్యారన్నారు. ఎల్ఎల్ఎం 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 12 మందికి గానూ అంతా హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు



నిజాంసాగర్(జుక్కల్) : బేడిల మైశయ్య ఆలయ వార్శికోత్సవంలో భాగంగా సోమవారం మండలంలోని గోర్గల్‌లో మల్లయోధుల కుస్తీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. వివిధ మండలాల నుంచి మల్లాయోధులు తరలిరావడంతో పోటీలు రసవత్తరంగా సాగాయి. కుస్తీ పోటీల నిర్వాహకులు దుర్గారెడ్డి, అంజయ్య, మహేందర్‌రెడ్డి, సాయిలు, జీఎస్ఆర్, క్రేన్ మేనేజర్ మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి సీసీటీవీ కోర్సులో శిక్షణ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : డిచ్‌పల్లి మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) వారి ఆధ్వర్యంలో మంగళవారం (28) నుంచి సీసీటీవీ కోర్సులో శిక్షణ ప్రారంభమవుతుందని సంస్థ డైరక్టర్ ఎస్.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ 13 రోజుల పాటు ఇస్తారన్నారు. ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రం, టూల్ కిట్స్ అందిస్తారని తెలిపారు. నిజామా బాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డైరక్టర్ శ్రీనివాస్ కోరారు. 19 నుంచి 35 ఏళ్ల వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. 08461-222428, 08461-295428లో సంప్రదించాలన్నారు.